# ధర్మసూక్ష్మం



వేంకటాద్రి నాయనింగారు అమరావతిని రాజధానిగా చేసుకొని తెలుగు మండలాన్ని పరిపాలిస్తున్న రోజులవి. నాయనింగారి పరిపాలన మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతూ ఉన్నది. ప్రజలంతా సుఖశాంతులతో నిర్విచారంగా కాలం గడుపుతూ ఉన్నారు. న్యాయానికి ధర్మానికి మారుపేరుగా నాయనింగారు మంచి కీర్తిని సంపాదించుకొన్నారు. వారి ఆస్థానంలో న్యాయాధికారిగా ముమ్మనాచార్యులుగారు పనిచేస్తున్నారు. అలా పనిచేస్తున్న కాలంలోనే ఒక విచిత్రమైన వివాదం విచారణకు వచ్చింది. అదేమిటంటే

నాయనింగారి రాజ్యపు సరిహద్దుల్లో రామగిరి అనే చిన్న గ్రామం ఉంది. ఆ గ్రామంలో శివనాధుడనే మహా పండితుడున్నాడు. అతని పాండిత్యాన్ని మెచ్చుకొని ఒక తమిళ కోటీశ్వరుడు శివనాధుని కొక వజ్రాల హారాన్ని బహూకరించాడు. ఆ హారాన్ని ధరించి అనేక రోజులపాటు శివనాధుడు ప్రయాణం చేశాడు.

ఒకసారి అరణ్యం మధ్యగా పోతున్నప్పుడు శివనాధునికి విపరీతంగా దాహం వేసింది. దగ్గరలో జలాశయం ఉంటుందేమోనన్న అనుమానంతో అతను వెదకసాగాడు. ఒకచోట చెట్లు గుబురుగా కనిపించాయి. శివనాధుడు వంగి చూశాడు. అది పాడు పడిన బావి. నిజమేగాని, ఆ తొందరలో అతని మెడనున్న వజ్రాలహారం కాస్తా జారి ఆ బావిలో పడిపోయింది. అతనా దిగలేడు. వేలు ఖరీదు చేసే ఆ హారాన్ని వదులుకొని పోనూలేడు. దిక్కుతోచక అతను భోరుమని ఏడిచాడు.

అతని ఏడుపు విని కట్టెలు కొట్టుకొంటున్న ఒకడు వచ్చాడు. దుఃఖానికి కారణం తెలుసుకొన్నాడు. తను బావిలో దిగగలననీ వజ్రాలహారాన్ని తీయగలననీ, అయితే అందుకు తగిన ప్రతిఫలం ఇవ్వవలసి ఉంటుందనీ అతనన్నాడు. శివనాధుడందుకు అంగీకరించాడు.

"ఏమిస్తారు? " అన్నాడు కట్టెల మనిషి.

"నీ కిష్టమైనంత నాకివ్వు. మిగిలింది నువ్వు తీసుకో" అన్నాడు శివనాధుడు.

కట్టెల మనిషి బావిలో దిగాడు. వజ్రాల హారాన్ని తీశాడు. ఆ హారంలో 28 వజ్రాలున్నాయి. 20 తను తీసుకొన్నాడు. శివనాధునికి

8 మాత్రమే ఇచ్చాడు. వాటిని చూస్తూనే శివనాథుడు అవురుమన్నాడు. ఇది అన్యాయమంటూ గోలచేశాడు. ఉభయులూ కలిసి గ్రామాధికారిని దర్శించి విషయం చెప్పుకొన్నారు. కట్టెల మనిషిదే న్యాయమని అతను తీర్పుచెప్పాడు.

ఈ విధంగా అన్ని న్యాయస్థానాలూ శివనాథునికి వ్యతిరేకంగానే తీర్పుచెప్పాయి. అతనికి విసుగెత్తింది. సరాసరి వేంకటాద్రి నాయనిం గారిని దర్శించి జరిగిందంతా చెప్పుకొన్నాడు. శివనాథుడు చెప్పిందంతా నిజమేనన్నాడు కట్టెల మనిషి.

"న్యాయమూర్తీ మీరేమంటారు?" అన్నారు వెంకటాద్రి నాయనింగారు.

"ప్రభూ! రేపు తీర్పు చెబుతాను" అన్నారు ముమ్మనాచార్యులు గారు.

ఆ రాత్రంతా ఆచార్యులుగారు ఆలోచిస్తూనే ఉన్నారు. బ్రాహ్మణునికి అన్యాయం జరిగిందని తెలుస్తూనే ఉంది. ఆ అన్యాయాన్ని ఎలా తొలగించడమన్నదే సమస్య. తెల్లవారు జామున ఈ సమస్యకు పరిష్కారం దొరికింది.

"ప్రభూ! నీకిష్టమైనంత నా కివ్వు, మిగిలింది నువ్వు తీసుకో," అన్నాడు శివనాథుడు. కట్టెల మనిషి ఇందుకు భిన్నంగా వ్యవహరించాడు. కట్టెల మనిషికి ఇష్టమైంది 20 వజ్రాలు. అవును గదా! వాటిని శివనాథుని కివ్వాలి. మిగిలినవి 8. వాటిని కట్టెల మనిషి తీసుకోవాలి. ఇది వొప్పందానికి అనుగుణంగానే ఉంది" అన్నారు ముమ్మనాచార్యులు. ఈ తీర్పుకి అంతా సంతోషించారు.

—౦—